
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
బుధవారం 14 మే 2025



నిబంధనాల్లో ఇందిరమ్మ

- మంజూరీలు ఎక్కువ.. ప్రారంభాలు తక్కువ
- గిరిపల్లిలో 31 ఇళ్లకు..11మందికే రూ.లక్ష
- ఇదీ.. గజ్వేల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితి

8





రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలో ట్రాఫిక్ సిగ్నల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్

అభివృద్ధి పనుల శంకుస్థాపనలో నిర్మలా జగ్గారెడ్డి

హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో మంగళవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. హెచ్ఎండీఏ నిధులు రూ. 12 కోట్లతో పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి బైపాస్‌లో బసవేశ్వర విగ్రహం వరకు 2.6 కిలోమీటర్లు రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించే పనులకు శంకుస్థాపన చేశారు. 65వ నంబర్ జాతీయ రహదారి సమీపంలోని రైతువేదిక, శిల్పా వెంచర్ వెనుక నుంచి భూలక్ష్మమ్మ ఆలయం వరకు రూ. 4.50 కోట్లతో 60 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు, పట్టణంలోని రాజీవ్ పార్కు, అభివృద్ధి కోసం రూ. 12కోట్ల పనులకు మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ నాయకులు తోపాజీ అనంత కిషన్, బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ మనుచౌదరి



ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పట్టణంలోని సిద్ధేశ్వర గుట్టపై ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ నిర్మాణానికి గుర్తించిన స్థలాన్ని పరిశీలించి స్థల నమూనా ఆధారంగా భవన నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం కోసం మండలంలోని ఉమ్మాపూర్ శివారులో ఉన్న గుట్ట ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చదును పనులు వేగంగా జరుగుతుండడంతో ఆ స్థలాన్ని త్వరలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌కు అంద జేస్తామని చెప్పారు. జిల్లెలగడ్డ ప్రాంతంలో నేషనల్ అకాడమీ సెం టర్ భవన నిర్మాణానికి సేకరించిన రెండెకరాల స్థలాన్ని పరిశీలించారు. దీనిని శంకుస్థాపనకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. 150 పడకల ఆసుపత్రి మంజూరు కావడంతో పాత ఆసుపత్రి భాగాన్ని కూల్చేసి దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. పాత భవనంలో ఉన్న పలు విభాగాలను ఎంసీ హెచ్‌లోకి మార్చాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి ఉన్నారు.



హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ధాన్యం నుంచి వెళ్తున్న వరదనీరు

గాలివాన బీభత్సం

- తడిసిన ధాన్యం.. హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో పాలిథిన్ కవర్లు ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం

హుస్నాబాద్/తొగుట/చిన్నకోడూరు మే13 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో మంగళవారం సాయంత్రం జోరు వర్షం కురిసింది. దాదాపు అరగంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. ఆరబోసిన ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. దాదాపు 300 క్వింటాళ్ల వరకు తడిసినట్లు రైతులు తెలిపారు. పాలిథిన్ కవర్లు ఇవ్వకుండా మార్కెట్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, ఒక ఆధార్ కార్డుకు ఒకటే కవరు ఇస్తున్నారని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వేడుకున్నారు.

తొగుట మండలం వర్ధరాజ్‌పల్లిలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామంలో ఉప్పరి మల్లేశానికి చెందిన ఇంటిపైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఇంట్లో సామాన్లు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో పిడుగుపాటుకు ఎద్దు మృతిచెందింది. ఎద్దు విలువ రూ.70వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ఆర్ఐ మల్లికార్జున్ సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు.



హుస్నాబాద్‌లోని మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న మహిళా రైతు



తొగుట మండలం వర్దరాజ్‌పల్లిలో గాలివాన బీభత్సానికి ఎగిరిపోయిన ఇంటిపైకప్పు రేకులు



చిన్నకోడూరు మండలం సలేంద్రిలో పిడుగుపాటుకు మృతిచెందిన ఎద్దు

అంతా మా ఇష్టం!

సెటిల్‌మెంట్లకు అడ్డాగా ఠాణాలు

- ఓ స్టేషన్‌లో సీనియారిటీ లొల్లి
- ఎస్ఐ లేక సిబ్బంది ఇష్టారాజ్యం
- మరోచోట చేయి తడిపితేనే పని
- ఈ స్టేషన్‌లో అవినీతిపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజలకు రక్షణ కల్పిస్తూ అండగా ఉండాల్సిన ఠాణాలు అవినీతికి అడ్డాగా మారుతున్నాయి. రక్షకభటులే భక్షకులవుతున్నారు. న్యాయం జరుగుతుందని వచ్చిన పాపానికి ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఓ స్టేషన్‌లో చేయి తడిపితేనే కానీ పని కావడం లేదు. మరో స్టేషన్‌లో ఎస్ఐ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది సివిల్ పంచాయతీలు, సెటిల్‌మెంట్లు, దందాల్లో తలదూరుస్తు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బెజ్జంకి/మిరుదొడ్డి, మే 13 (ఆంధ్రజ్యోతి) : నెల రోజుల నుంచి జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ కమిషనరేట్‌కు అటాచ్ కాగా ఆయన స్థానంలో మరో అధికారి రావాల్సి ఉంది. పలువురు ఎస్ఐలు పోస్టింగు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా ఎస్ఐ లేని సమయాన్ని చూసి కొందరు సీనియర్ సిబ్బంది సివిల్ పంచాయతీలు, పలు అక్రమ దందాల్లో తల దూర్చి వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సివిల్ పంచాయతీల్లో చేతివాటం

ఎస్ఐ లేని ఈ పోలీస్‌స్టేషన్‌లో సీనియర్లం అని చెప్పుకుంటూ ఓ అధికారితో పాటు మరికొంతమంది సిబ్బంది సివిల్ పంచాయతీల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తుంది. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఓ భూతగాదా విషయంలో సంబంధిత వ్యక్తులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు అధికారి అలాగే కొంతమంది సిబ్బంది ఆ తగాదాలో తలదూర్చి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. ఇదే కాకుండా ఓ గ్రామంలో రెండు కుటుంబాల వ్యక్తులు పరస్పరం దూషించుకుని స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయంలో సదరు అధికారి ఆ గ్రామానికి వెళ్లి ఓ కుటుంబానికి అనుకూలంగా వ్యవహరిస్తూ సదరు సాక్ష్యులను సైతం బెదిరింపులకు గురి చేసినట్లు తెలిసింది.

ఇక పోలీసుస్టేషన్‌కు తానే సీనియర్ అని.. తను చెప్పినట్లే సిబ్బంది పని చేయాలని హుకుం జారీ చేస్తున్నట్లు పోలీసుస్టేషన్‌లో చర్చ జరుగుతుంది. తనకు తెలియకుండా ఏ పని జరగకూడదని సీనియర్ సిబ్బంది, కింది స్థాయి సిబ్బందిని ఆదేశిస్తున్నట్లు తెలిసింది. సదరు అధికారికి తెలియకుండా ఏ చిన్న పని జరిగినా కిందిస్థాయి సిబ్బందిపై విరుచుకుపడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు అధికారి సివిల్ పంచాయతీలు, ఇతర అక్రమ దందాల్లో తలదూర్చి అందినకాడికి దండుకుంటున్నాడని స్టేషన్ సిబ్బంది మధ్య చర్చ జరుగుతుంది. ఎస్ఐ లేకపోవడంతో తనదైన శైలిలో వ్యవహరిస్తున్న అవినీతికి పాల్పడుతున్న సదరు అధికారిపై, మరికొంతమంది సిబ్బందిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సెటిల్‌మెంట్లకు అడ్డాగా

ఇక జిల్లాలోని మరో పోలీస్‌స్టేషన్‌లో సైతం నిత్యం పంచాయతీలు, సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారింది. ఇటీవల ఇక్కడ హోంగార్డు ఏసీబీకి చిక్కారు. ఇదే అంశంపై దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కూడా వెనుక పెద్దలపాత్ర లేనిదే ఈ వ్యవహారం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. స్టేషన్ అమీన్‌సాబే అసలు సూత్రదారంటూ ఘాటైన విమర్శలు చేశారు. దీంతో ఆ ఠాణాలో వ్యవహారం ఒక్కొక్కటిగా వెలుగుచూస్తుంది. దొంగలను పట్టుకోవాల్సిన పోలీసులే దొంగను వదిలిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. ఓ గ్రామానికి చెందిన ఓ దొంగ తన సోదరుడి ఏటీఎంను దొంగిలించి మెదక్ జిల్లా రామాయంపేట నుంచి ఏటీఎం నుంచి రూ.30వేలు డ్రా చేశాడు. బాధితుడు తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌తో మిరుదొడ్డి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి దొంగను నిర్ధారించారు. అంతలోనే ఏం జరిగిందో ఏమో కానీ దొరికిన దొంగను వదిలేశారు. బాధితుడు రోజూ స్టేషన్‌కు వచ్చి వెళ్తున్నా అతన్ని పట్టించుకునే నాథుడే లేడు. ఇక స్టేషన్ గేటు ముందు ఇక్కడ భూతగాదాలు పరిష్కరించబడవు అంటూ బోర్డు పెట్టారు. కానీ లోపల మాత్రం భూ పంచాయతీలు, సెటిల్‌మెంట్లతో భారీగా డబ్బు దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటి స్థలం బయానా విషయంలో కులపెద్దల వద్ద పంచాయతీ జరిగింది. ఇంటి పక్కన ఉన్న స్థలాన్ని మొదట కొనమని, ఆ తర్వాత పక్కింటి వ్యక్తి తామే కొంటామని పోలీస్‌స్టేషన్‌వచ్చి ఫిర్యాదు చేశారు.

మిగతా 8లో..



పోలీస్‌స్టేషన్ గేటు వద్ద ఇక్కడ భూతగాదాలు పరిష్కరించబడవు అని దర్శనమిస్తున్న బోర్డు

గ్రంథాలయాల రారాజు



టీవై రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బూర్గుపల్లి పాఠశాలకు పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

- వంద గ్రంథాలయాల ఏర్పాటుకు తలకొక్కుల రాజు శ్రీకారం
- ఇప్పటికే 38 ఏర్పాటు
- గజ్వేల్‌లో 7వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీవై రాజు విజ్ఞాన కేంద్రం
- ఇక్కడే పోటీపరీక్షల అభ్యర్థులకు ఉచిత శిక్షణ
- పేద విద్యార్థులకు మేలు జరిగేలా వెబ్‌సైట్ ఏర్పాటుకు సన్నాహాలు

7



హాల్‌టికెట్ నంబర్లు చెక్ చేసుకుంటున్న విద్యార్థులు



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పాలిసెట్ విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రశాంతంగా పాలిసెట్

- జిల్లాలో 8 కేంద్రాల్లో నిర్వహణ
- 3,596 మంది పరీక్షకు హాజరు

సిద్దిపేట కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా, వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష (పాలిసెట్ 2025) మంగళవారం ప్రశాంతంగా ముగిసిందని సెంటర్ల సమన్వయకర్తలు అలుగోజు గోవర్ధన్, సీహెచ్ కృష్ణారావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8 పరీక్ష కేంద్రాల్లో 3,801 మంది విద్యార్థులకు గానూ 3,596 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. సిద్దిపేటలోని ఐదు సెంటర్లలో 2,606 మంది విద్యార్థులకు 2,467 మంది హాజరయ్యారు. గజ్వేల్ కో ఆర్డినేటింగ్ సెంటర్‌లోని మూడు సెంటర్లలో 1195 మంది విద్యార్థులకు 1129 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 12 రోజుల్లో ఫలితాలు వెల్లడవుతాయని అధికారులు తెలిపారు. సిద్దిపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌కు ఐదుగురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. నిమిషం నిబంధన కారణంగా వారిని అధికారులు అనుమతించలేదు.



సిద్దిపేటలోని పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



గజ్వేల్ ఏరియా కోఆర్డినేటర్ కృష్ణారావు, సిబ్బంది

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి

నంగునూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులకు సూచించారు. మంగళవారం నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు తిప్పని నాగేంద్రం సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలను డీపీవో దేవకిదేవితో కలిసి సందర్శించారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు సంబంధించి రైతు నాగేంద్రను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీలో పారదర్శకంగా ఎంపిక జరగాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాలమాకుల ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ సరిత, ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీవో ప్రభాకర్ రావు, ఏవో గీత, ఆర్ఐ లింగం, ఏపీఎం మహిపాల్ తదితరులు ఉన్నారు.

తైబజార్.. ఎవరి జేబుల్లోకి..!

● గడువు ముగిసిన ఊసేలేని వేలం ● అయినా ఆగని వసూళ్లు ● ప్రభుత్వ ఆదాయానికి గండి



గుమ్మడిదల మున్సిపాలిటీలో కొనసాగుతున్న వారాంతపు సంత (ఫైల్)

గుమ్మడిదల, మే 13 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో గడువు ముగిసినా తైబజార్ వేలం నిర్వహించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వచ్చే కొద్దిపాటి తైబజార్ ఆదాయంతో అభివృద్ధి పనులకు నిధులను విని యోగించేవారు. గతంలో గుమ్మడిదల మండల కేంద్రంలో మేజర్‌గా గ్రామ పంచాయతీగా గుమ్మడిదల ఉండడంతో అక్కడ మాత్రమే తైబజార్ వేలంపాట నిర్వహించేవారు. 2024-2025 మార్చి వరకు గుమ్మడిదల వారాంతపు సంతకు లక్షల్లో వేలం దక్కించుకున్న సందర్భాలు ఉన్నాయి. గత మార్చి నెల లోనే వేలం గడువు ముగిసింది. కొన్ని నెలల క్రితం గుమ్మడిదల ను మున్సిపాలిటీగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గుమ్మడిదల లో గురువారం, అన్నారం, దోమడుగు, బొంతపల్లి గ్రామాలలో ఆదివారం సంతలు నిర్వహిస్తారు. దీంతో లక్షల రూపాయలలో వ్యాపార కొనుగోలు విక్రయాలు జరుగుతాయి. తైబజార్ లేకపోవడంతో వారాంతపు సంత నుంచి లక్షల్లో గుమ్మడిదల మున్సిపాలిటీకి ఆదాయం గండి పడుతుంది. గడువు తీరిన కొందరు వ్యక్తులతో వారంతపు సంతలలో పాత వ్యక్తులే తైబజార్ వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ డబ్బు ఎక్కడికి వెళ్తుందో తెలియని పరిస్థితి దాపురించిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వెంటనే మున్సిపాలిటీ పరిధిలోని వారాంతపు సంతలను కలిపి తైబజారు వేలం నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తైబజార్ వేలంపాట నిర్వహిస్తాం

గుమ్మడిదల మున్సిపాలిటీలో తైబజార్ వేలంపాట గడువు ముగిసిన విషయం వాస్తవమే. అయితే సమయభావం లేక తైబజార్ వేలం నిర్వహించలేకపోయాం. వాస్తవానికి తైబజార్ వేలం జాప్యంతో మున్సిపాలిటీ కొంత ఆదాయం కోల్పోయింది. గడువు ముగిసిన పాత వ్యక్తులు ఎవరు తైబజార్ వసూలకు పాల్పడలేదు. తొందర్లోనే తైబజార్ వేల పాట ఏర్పాటు చేసి మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుతాం.

-రఘు, మున్సిపల్ కమిషనర్ గుమ్మడిదల

ఉపాధ్యాయులకు శిక్షణ షురూ



కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆంగ్లం చదవడం, రాయడం నేర్పించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో జరిగే ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంగారెడ్డిలోని జడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభమైన శిక్షణ తరగతులను ఆమె సందర్శించారు. అలాగేఈ ఈ కార్యక్రమంలో ఏఎంవో బాలయ్య, సీఎంవో వెంకటేశం, కోర్సు డైరెక్టర్లు విద్యాసాగర్, భాస్కర్, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో ..

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలన్న లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో విడతల వారీగా ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణ ప్రారంభమైంది. మంగళవారం మెదక్ కేజీబీవీ, డైట్ కళాశాలలో శిక్షణ కొనసాగింది. తొలిరోజు 511 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావాల్సి ఉండగా.. 457 మంది టీచర్లు హాజరయ్యారు. ఉపాధ్యాయులందరూ శిక్షణకు హాజరుకావాలని డీఈవో రాధాకిషన్ తెలిపారు.



మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలోని ఉపాధ్యాయుడు లక్ష్మణ్ నివాసంలో మంగళవారం మే పుష్పం (ఫుట్బాల్ లిల్లీ) వికసించి అందరిని ఆకట్టుకుంది. ప్రతి సంవత్సరం మేలో ఈ పుష్పం వికసిస్తుందని వారు తెలిపారు. ఎరుపు పచ్చని వర్ణాలతో వికసించిన ఈ అందమైన పుష్పాన్ని స్థానిక ప్రజలు తిలకిస్తున్నారు.

పెద్దశంకరంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి):

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



శ్రీనివాస్‌కు నీళ్లు తాగిస్తున్న ఎమ్మెల్యే

చేగుంట, మే 13 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం బోనాల కొండాపూర్ స్టేజ్ వద్ద దౌల్తాబాద్ మండలం గోవిందాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు ఫిట్స్ వచ్చి బైక్ పై నుంచి కింద పడ్డాడు. మంగళవారం దుబ్బాక నియోజకవర్గ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శ్రీనివాస్‌ని గమనించి వెంటనే కారు దిగి అంబులెన్స్‌కి ఫోన్ చేసి గాయాలైన శ్రీనివాస్‌ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలైన యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్లకు ఫోన్లో చెప్పారు. గాయాలైన యువకుడిని ఆస్పత్రికి తరలించి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు.

వరకట్నపు వేధింపులతో మహిళ ఆత్మహత్య



నిందితులను అరెస్ట్ చేసిన సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): వరకట్నపు వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న కేసులో నలుగురు నిందితులను సిద్దిపేట టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సిద్దిపేట ఏసీపీ మధు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. జనగామ జిల్లా బచ్చన్నపేట గ్రామానికి చెందిన దంతూరి పుష్ప కూతురు అక్షయ, సిద్దిపేట పట్టణంలోని వివేకానంద కాలనీకి చెందిన చెన్న సత్తయ్య కుమారుడు చెన్న పవన్ 2019లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తర్వాత 2020లో ఇరు కుటుంబాల సమక్షంలో అక్షయ తల్లిదండ్రులు ఘనంగా పెళ్లి జరిపించి రూ.5 లక్షల కట్నం, నాలుగు తులాల బంగారం పెట్టారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. తర్వాత పవన్ అతడి కుటుంబ సభ్యులు అక్షయను అదనపు వరకట్నం కోసం వేధించారు. వేధింపులు తాళలేక ఆమె ఈ నెల 10వ తేదీన గుర్తుతెలియని ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 11వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు మృతి చెందింది. తర్వాత మృతురాలి తల్లి దంతూరి పుష్ప సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు వరకట్న వేధింపులతోనే అక్షయ మృతి చెందిందని తేల్చారు. మృతికి కారణమైన భర్త పవన్‌ను, మామ సత్తయ్యను, అత్త కనకవ్వను, మరిది కల్యాణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చోరీ

కొండపాక, మే 13 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగలో అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మర్పడగలోని రెండు అంగన్‌వాడి కేంద్రాల గది తలుపుల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి వంట సామగ్రి , నిత్యవసర వస్తువులను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల ఒక గదిలో గ్రామ పంచాయతీకి చెందిన సామగ్రిని స్టోర్ రూమ్‌లో ఉంచుతారు. ఆ గది తాళాలు పగలగొట్టి అందులో ఉన్న పాత మోటార్లు, పైపులు అపహరించారు . అలాగే పాఠశాల ఆవరణలో నిలిపిన గ్రామానికి చెందిన కనకా రెడ్డి ఎక్సకవేటర్ బ్యాటరీని కూడా దొంగలు చోరీ చేశారు.

పెద్దమ్మ ఆలయంలో హుండీ ధ్వంసం

● నగలు, నగదు చోరీ

రామాయంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండల పరిధి రాయిలాపూర్ పెద్దమ్మ ఆలయంలో దోపిడీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు హుండీని ధ్వంసం చేసి 15 గ్రాములు బంగారు నగలు, లక్ష రూపాయలకు పైగా నగదును ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ పై నుంచి పడి వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): బైక్ పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన దేవేందర్ రెడ్డి సోమవారం రాత్రి తన ద్విచక్ర వాహనం పై ఇంటికి తిరిగి వెళ్తుండగా బండమాదారం గ్రామ రామిరెడ్డి బావి వద్ద బైక్ పై నుంచి కింద పడి మృతి చెంది నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రోడ్డుపై పడి ఉన్న దేవేందర్‌ను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ జరిపి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు రాయిలా పూర్ గ్రామంలో ప్యాడీ హార్వేస్టర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం

మేడ్చల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటికి వెళ్తానని హాస్టల్ నుంచి బయలు దేరిన ఓ బీటెక్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. విద్యార్థి తండ్రి భాగయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నార్సింగి గ్రామానికి చెందిన గోట కిరణ్ కుమార్ కండ్లకోయ సమీపంలోని హాస్టల్‌లో ఉంటూ సీఎంఆర్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వెళ్తున్నానని హాస్టల్ నుంచి బయలు దేరిన కిరణ్ కుమార్ ఇంటికి చేరక పోవటంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలించారు. ఆచూకీ తెలియక పోవటంతో భాగయ్య మంగళవారం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దివ్యాంగురాలి దారుణ హత్య

రామాయంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలిని దారుణంగా హత్య చేసిన ఘటన రామాయంపేట మండల పరిధి తొనిగండ్ల శివారులో మంగళవారం వెలుగుచూసింది. సుమారు నలభై ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని మహిళను తలపై బండరాయితో కొట్టి చంపేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. తొనిగండ్ల శివారులో మహిళ మృతదేహం పడి ఉండగా, అటుగా వెళ్తున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా ఆమె రెండు కాళ్లు చచ్చుబడి ఉన్నాయి. ఆమె కుడి చేయిపై రజిత అని, ఎడమ చేతిపై మహేష్ అని పచ్చబొట్లు ఉన్నాయి. మంగళవారం వేకువ జామున ముగ్గురు వ్యక్తులు కారులో ఆమెను బలవంతంగా తీసుకువచ్చి. ఈ ప్రాంతంలో చంపేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, రామాయంపేట సీఐ వెంకట రాజాగౌడ్ పరిశీలించారు. హత్యకు గురైన మహిళ ఎవరు? ఆమెను హత్య చేయడానికి గల కారణాలు ఏమిటీ అన్న కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి.. ఒకరి మృతి

కౌడిపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి కింద పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని నాగ్‌సాన్‌పల్లి శివారులో జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిలపూర్ గ్రామానికి చెందిన కుర్మ కిష్టయ్య (51) వెల్దుర్తి మండలంలోని ధరిపల్లికి వెళ్లి వస్తుండగా బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టాడు. దీంతో కిందపడి మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లే సరికి మృతి చెందాడు. మృతుడు రాయిలపూర్ గ్రామానికి చెందిన కుర్మ కిష్టయ్యగ గుర్తించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి శవాని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ అసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

వర్గల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో తీవ్రమనస్తాపం చెంది వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన చింతకింది మహేశ్ (36) అనే యువకుడు ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి గౌరారం ప్రొబేషనరీ ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల మేరకు. వేలూర్ గ్రామానికి చెందిన చింతకింది మహేశ్‌కు భార్య అనుష, కూతురు వైష్ణవి ఉన్నారు. మహేశ్‌కు నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో కుడి కాలు ఫ్రాక్చర్ అయింది. సంవత్సరం క్రితం ఇంటి నిర్మాణం చేశాడు. ఇంటి నిర్మాణం కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక తీవ్రమనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేశ్ ప్లాస్టిక్ తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అనుష ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జహీరాబాద్‌లో యువకుడు..

జహీరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహీంద్రకాలనీలో రవికాంత్‌చారి(34) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మత్యకు పాల్పడ్డాడు. జహీరాబాద్ పట్టణానికి చెందిన రవికాంత్ 10సంవత్సరాలుగా బంగారునగల వ్యాపారం చేస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులు, ఇతరత్రా కారణాలు వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పలువురు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగ తమకు ఫిర్యాదు అందలేదని వివరించారు.

కారు ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలు

కౌడిపల్లి, మే13 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా వచ్చిన కారు ఢీ కొనడంతో ఇద్దరి యువకుల పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం వెంకట్రావ్ పేట్ గేట్ సమీపంలో జాతీయ రహదారి 765డి పై జరిగింది. మండల పరిధిలోని రాజీపేట్ గ్రామానికి చెందిన తోళ్ల రమేష్, ఊరట్ల లక్ష్మణ్ తమ ద్విచక్ర వాహనం పై నర్సాపూర్‌కు బయలు దేరారు. ఇదే క్రమంలో నర్సాపూర్ నుంచి అతివేగంగా వస్తున్న కారు నేరుగా వెళ్ళి బైక్‌ని ఢీ కొనడంతో ఇద్దరు యువకులు గాలిలో ఎగిరి కారు పై నుంచి కింద పడటంతో తీవ్ర గాయలయ్యాయి. క్షతగాత్రులను హైద్రబాద్ లోని అసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం

లారీ ఢీకొని బాలికకు..



శిరీషను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

చేగుంట, మే 13 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని ఓ బాలికకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండలం కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగింది. చిన్న శంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన దండు యాదగిరి కుమార్తె నేరెళ్ల దండు శిరీష మెదక్ బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా గాంధీ చౌరస్తా వద్ద లారీ ఢీకొనడంతో లారీచక్రాల కింద పడింది. అది గమనించిన స్థానికులు లారీని ఆపడంతో శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు.



భరతనాట్యం నేర్పిస్తున్న శిక్షకురాలు భవాని

వేసవి శిబిరానికి విశేష స్పందన

చేర్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో చిన్నారులకు శాస్త్రీయ నృత్యకళలు నేర్పించేందుకు వివేకానంద టీచర్స్ అసోసియేషన్ చేర్యాల పట్టణంలో ఉచితంగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తుంది. ఇటీవలే ప్రారంభించగా రోజురోజుకూ విశేష స్పందన లభిస్తోంది. శిక్షకురాలిగా సిద్దిపేటకు చెందిన భవానిని నియమించగా, ఆమె ప్రతీనిత్యం ఉదయం శాస్త్రీయ, సంప్రదాయ నృత్యకళలైన కూచిపూడి, భరతనాట్యం, పేరిణిలలో మెళకువలు నే ర్పుతున్నారు. యోగాసనాలపైనా శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం 260మంది విద్యార్థులు శిబిరానికి హాజరవుతున్నారు. చిన్నారులకు స్నాక్స్ సమకూర్చుతున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు సైతం శిక్షణ శిబిరాన్ని సందర్శించి హర్షం వెలిబుచ్చుతున్నారు. సేవానిరతితో శిబిరాన్ని ఏర్పాటుచేసిన వివేకానంద టీచర్స్ అసోసియేషన్‌ను వారు అభినందిస్తున్నారు. సేవానిరతి మా అభిమతంగా సమాజ హితానికి పాటుపడుతూ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివేకానంద టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కలకోటి సురేందర్‌రెడ్డి తెలిపారు. వేసవి సెలవులను చిన్నారు లు వృథా చేసుకోకుండా ఉండటంతో పాటు శాస్త్రీయ నృత్యకళల పట్ల మొగ్గుచూపే విధంగా ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పాశ్చాత్య పోకడలకు గురవకుండా ఉండాలని చేసిన ప్రయత్నం ఫలించడం సంతోషం కల్పిస్తుందన్నారు.



శిక్షణకు హాజరైన చిన్నారులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వివేక్

నక్సలిజం అడవుల్లో అంతరించి.. పట్టణాల్లో పెరుగుతోంది

● ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వివేక్

సిద్దిపేట కలెక్టరేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : నక్సలిజం అడవుల్లో అంతరించి పట్టణాల్లో పెరుగుతోందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వివేక్ అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో అర్బన్ నక్సల్స్ అనే అంశంపైన పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ. ప్రజాస్వామ్యంలో హింసకు తావుండకూడదనే ఉద్దేశంతో భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కోరడం శోచనీయాంశం అని అన్నారు. అభివృద్ధికి ఆటంకాలు అయినటువంటి నక్సల్, మావోయిస్టులపై ఎందుకు ఉక్కు పిడికిలి బిగించరాదో చెప్పాలని ప్రశ్నించారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన విద్యాకమిషన్‌లోని ఉన్నతాధికారులు కూడా నక్సలైట్ల మద్దతుగా మాట్లాడం, సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం శోచనీయమన్నారు. ఇలాంటి నరహంతక నక్సలైట్లను ఏరిపారెయ్యడాన్ని ఏబీవీపీ స్వాగతిస్తుందన్నారు. ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణీంద్ర, అంబేద్కర్ జోనల్ ఇన్‌చార్జి అనీష్, సాయిరాం, ధనుష్, లోకేష్ పాల్గొన్నారు.

ఎంఎన్ఆర్, ఐఐటీహెచ్ మధ్య ఒప్పందం

సంగారెడ్డి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎంఎన్ఆర్ విద్యాసంస్థ, బీఏబుల్ హెల్త్ ప్రై.లి., ఐఐటీ హైదరాబాద్ కీలక ఒప్పందం చేసుకున్నాయి. ఈ మేరకు మంగళవారం ఎంఓయూపై సంతకాలు చేసి ఒకరికొకరు మార్చుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ రవివర్మ, ఐఐటీ హైదరాబాద్ అధిపతి ప్రొ. రెనుజాన్, బీఏబుల్ హెల్త్ సీఈవో హబీబ్ అలీ, బీఏబుల్ సహ సంస్థాపకుడు శ్రీహరి, ఆయా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతోనే ప్రయోజనాలు

● మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



ఖేడ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

పుల్‌కల్/నారాయణఖేడ్, మే 13 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల సాగుతోనే అధిక ప్రయోజనాలు పొందవచ్చని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో మంగళవారం ఏరువాక కేంద్రం సంగుపేట-వ్యవవసాయ ఇంజనీరింగ్ కళాశాల కంది అధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతలకు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అవసరం మేరకు రసాయన ఎరువులను వినియోగించి నేల తల్లిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయ కర్త రాహుల్ విశ్వకర్మ, జోగిపేట ఏడీఏ రమాదేవి, ఏవో ప్రవీణ, ఏఈవో ప్రవీణ్, ఏరువాక కేంద్రం వైపీ-1 ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు. గిరిజన తండాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు పూజారులు దూపదీప నైవేద్యం పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ కోరారు. మంగళవారం నారాయణఖేడ్‌కు వచ్చిన సందర్భంగా దూపదీప నైవేద్యం దరఖాస్తు ఫారాలను పూజారులకు అందజేసి మాట్లాడారు. ఈనెల 24లోగా అర్హులైన పూజారులు రెండు గుడి ఫొటోలు, ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్‌తో పాటు ఫారం నంబరు 43తో దరఖాస్తు నింపి ఇవ్వాలన్నారు. దిశకమిటీ సభ్యులు ప్రకాష్‌రాథోడ్, మాజీ జడ్పీటీసీ రాజురాథోడ్, రూప్‌సింగ్, నాయకులు నారాయణ, సురేష్‌నాయక్, శేఖరావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్ పట్టణంలోని టీవై రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రం

గ్రంథాలయాల రారాజు

వంద గ్రంథాలయాల ఏర్పాటుకు తలకొక్కుల రాజు శ్రీకారం

ఇప్పటికే 38 ఏర్పాటు

గజ్వేల్ పట్టణంలో 7వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీవై రాజు విజ్ఞాన కేంద్రం

ఇక్కడే పోటీపరీక్షల అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పేద విద్యార్థులకు మేలు జరిగేలా వెబ్‌సైట్ ఏర్పాటుకు సన్నాహాలు



టీవై రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలకు పుస్తకాలను అందజేస్తున్న టి.రాజు, ఫౌండేషన్ సభ్యులు

జ్ఞాన సంపదగా.. విజ్ఞాన కేంద్రాలుగా.. విద్యార్థుల బంగారు భవితకు బాట వేసే గ్రంథాలయాల ఏర్పాటుకు హైకోర్టు న్యాయవాది, తెలంగాణ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు, గజ్వేల్‌కు చెందిన తలకొక్కుల రాజు ముందుకు కదిలారు. గ్రంథాలయాలు సమాజానికి చాలా ముఖ్యమైనవవని భావించిన ఆయన విద్యార్థులకు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవర్చాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు పూనుకున్నారు. తన పేరు, తన తండ్రి తలకొక్కుల ఎల్లయ్యగారి రాజు పేరుతో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రంథాలయాలు ఏర్పాటే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

గజ్వేల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ తాలూకా పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, యూత్ భవనాల్లో 100 గ్రంథాలయాల ఏర్పాటు లక్ష్యంగా టీవై రాజు ఫౌండేషన్ కృషి చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే 38 చోట్ల గ్రంథాలయాల ఏర్పాటు పూర్తి చేసింది. స్వయంగా టీవై రాజు ఫౌండేషన్ సభ్యులు పాఠశాలలు, కళాశాలల నుంచి, యూత్ క్లబ్‌ల నుంచి దరఖాస్తులు స్వీకరించి... వారు గ్రంథాలయాన్ని నడపగలరా.. లేదా అని ఆరా తీసి, ఇతరత్రా సదుపాయాలను పరిశీలించిన అనంతరమే గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలకు 452 పుస్తకాలు, రెండు బీరువాలు, 16 మ్యాగ్జిన్లు ఇవ్వడంతో పాటు ప్రతి నెలా వ్యాసరచన పోటీలను, వకృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేస్తున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి నూతన పుస్తకాలను అందజేస్తున్నారు. వచ్చే 50 ఏళ్ల వరకు గ్రంథాలయాల నిర్వహణకు సంబంధించిన నిధిని ఇప్పటికే టీవై రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిపెట్టారు.

గజ్వేల్ పట్టణంలో విజ్ఞాన కేంద్రం

గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్ పక్కన మార్కెట్ రోడ్‌లో గల టీవై రాజు ప్రైడ్‌లో ఏడు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీవై రాజు విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అందులో నాలుగు వేల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా 80వేల పుస్తకాలను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి విద్యార్థులకు, కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు అందుబాటులో ఉంచారు. గ్రూప్స్ సివిల్స్, కానిస్టేబుల్, ఎస్సై, డీఎస్సీ తదితర కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించి శిక్షణనూ అందిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొంది దాదాపు 20మంది ఉద్యోగాలను సాధించారు.

ప్రత్యేక వెబ్‌సైట్..

టీవై రాజు ఫౌండేషన్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నారు. ఇందులో ఎల్‌కేజీ నుంచి మొదలుకొని పీహెచ్‌డీ వరకు దేశ విదేశాల్లో గల పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేయనున్నారు. అంతేకాకుండా ఆయా వ్యవస్థల ద్వారా, ఆయా ఆర్గనైజేషన్ల ద్వారా లభించే స్కాలర్‌షిప్‌లకు సంబంధించి వివరాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు. తల్లిదండ్రుల పేరు, ఆర్థిక స్థోమత సాకుగా చూపించి చదువుకోలేకపోయామని చెప్పే విద్యార్థులు ఉండొద్దన్న ఉద్దేశంతో ఈ వెబ్‌సైట్‌ను రూపొందించి, స్కాలర్‌షిప్‌ల ద్వారా చదువుకోవాలన్న సంకల్పంతోనే ఉన్నట్లు టీవై రాజు తెలిపారు.



గజ్వేల్ పట్టణంలోని విజ్ఞాన కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

వినియోగించుకోవాలి..



టీవై రాజు విజ్ఞాన కేంద్రాన్ని గజ్వేల్ ప్రాంత విద్యార్థులు, ఉద్యోగార్థులు సద్వినియెగం చేసుకోవాలి. తాను పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో వినియోగించుకుని ఐదు జాబ్‌లు సాధించాను.

-అమరవాది మృణాళిని, గజ్వేల్

గజ్వేల్ బిడ్డలను సివిల్ సర్వీసెస్‌లో చూడాలనే..



గజ్వేల్ బిడ్డలను సివిల్ సర్వీసెస్ అధికారులను చూడాలన్నదే నా తాపత్రయం. ఆ సంకల్పంతోనే విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేశా. ఇప్పటికే చాలా వరకు పాఠశాలల్లో విజయవంతంగా గ్రంథాలయాలు నడుస్తున్నాయి. ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించి అందులో ఉచితంగా బోధన అందించే పాఠశాలలు, కళాశాలలు, విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలను చేర్చడంతో పాటు స్కాలర్‌షిప్‌లు అందించే అంశాన్ని గూర్చి వివరాలను పొందపరుచనున్నా.

-టి.రాజు, టీవై రాజు ఫౌండేషన్ ఛైర్మన్

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

● జడ్పీ సీఈవో ఎల్లయ్య

శివ్వంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అధికారులకు సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టర్‌కు నివేదిక పంపించాలని సిబ్బందికి సూచించారు. అలాగే రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు ఆలస్యం చేయకుండా బ్యాంకు సమ్మతి కోసం పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ● ఫిజియోథెరపీ యూనిట్ ప్రారంభం

మెదక్ కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలదించాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌కు నిరవధిక విద్యుత్ సరఫరా కోసం 15 లక్షల నిధులతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులను వివరాలు అడగగా దీనికి సంబంధించిన పని ఈ ఆదివారం లోపు పూర్తవుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఎంపీకి హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ వ్యక్తిగత నిధులు రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ యూనిట్‌ను ఎంపీ రఘునందన్ రావు కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ యూనిట్ ద్వారా రోగులకు మెరుగైన చికిత్స అందే అవకాశముందని అన్నారు. ఆసుపత్రిలో చీకటిగా ఉండటం వలన అవసరమైన వెంటిలేషన్ కోసం మెష్ డోర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వైద్యుల కోరిక మేరకు రోగుల తాగునీటి కోసం మినరల్ వాటర్ ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరగా ఇందుకు అవసరమైన నిధులను ఎంపీ నిధుల ద్వారా విడుదలయ్యేలా చూస్తామన్నారు. ఆసుపత్రి పరిసరాల్లో మురుగు నీటితో స్థానిక నివాసితులకు ఇబ్బంది అవుతుందని గ్రహించిన ఎంపీ రఘునందన్‌రావు.. సమస్య పరిష్కారానికి ఎంపీ నిధుల నుంచి రూ.15 లక్షలు మెదక్ మున్సిపాలిటీకి తక్షణమే మంజూరు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరాం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ సునీతదేవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ శివదయాల్, డాక్టర్ కిరణ్ రెడ్డి, మెడికల్ కాలేజ్ వైద్యులు సిబ్బంది, బీజేపీ నేతలు ప్రసాద్, కాశినాథ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాహుల్ రాజ్ తో కలిసి ఫిజియోథెరపీ యూనిట్‌పే ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

డిగ్రీ సీటు కావాలా 'దోస్త్'

● సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సహాయకేంద్రం

● సాంకేతిక, ఇతర సమస్యలు పరిష్కారమే లక్ష్యం

సిద్దిపేట కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్ ఇప్పటికే విడుదలైంది. ఈ నెల 3 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, 10 నుంచి వెబ్ ఆప్షన్స్‌కు అవకాశమిచ్చారు. రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్ ప్రక్రియలో విద్యార్థులకు కొన్ని సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 40 సహాయక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు డిగ్రీ అడ్మిషన్ ప్రక్రియలో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు ఈ హెల్ప్‌లైన్ సెంటర్ పనిచేస్తుంది.



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ జిల్లా సహాయ కేంద్రం

దరఖాస్తు ప్రకియలో సమస్యలోస్తే...

నాలుగు దశల్లో దోస్త్ ద్వారా డిగ్రీలో అడ్మిషన్ ప్రక్రియ ఉంటుంది. ఈ దశల్లో విద్యార్థులకు పలు సమస్యలు ఎదురవుతుంటాయి. జిల్లా పరిధిలో కళాశాలలు, విద్యార్థులకు వచ్చే సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎక్కువగా ఆధార్ కార్డులోని వివరాలకు ఇంటర్మీడియట్‌లోని డిటేయిల్స్ మిస్‌మ్యాచ్ అవ్వడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడతారు. అంతేకాకుండా సర్టిఫికెట్స్ అప్‌లోడ్ కాకపోవడం, ఇతర రాష్ట్రాల విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ వంటి సమస్యలతో పాటు కళాశాల లాగిన్ కూడా పలు సమస్యలు తలెత్తుతుంటాయి. డేటా బర్త్ తప్పుగా ఎంట్రీ చేయడం, పేమెంట్ పూర్తయ్యాక రిసిప్ట్ రాకపోవడం ఇలాంటి తదితర ఇబ్బందులు, సాంకేతిక సమస్యలు వస్తుంటాయి. ఇలాంటి సమస్యల పరిష్కరించేందుకు ఈ హెల్ప్ లైన్ సెంటర్ సహాయం చేస్తుంది. ఈ హెల్ప్‌లైన్ సెంటర్ కో ఆర్డినేటర్‌గా డా. భాస్కర్, టెక్నికల్ అసిస్టెంట్ మహేష్ విద్యార్థులకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారం చేస్తారు. అలాగే కేవలం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దోస్త్ ద్వారా అప్లై చేసుకోవచ్చు.

ముందుగా యూజర్ మాన్యువల్ చదవాలి



విద్యార్థులు పూర్తి సమాచారంతో దరఖాస్తు చేయాలి. అలాగే సరైన ఇన్ఫర్మేషన్ తెలుసుకున్నాకనే కాలేజ్ సెలెక్ట్ చేసుకోవాలి. అప్లై చేసేముందు దోస్త్ వెబ్‌సైట్ యూజర్ మాన్యువల్ చూసి పూర్తిగా అవగాహన వచ్చాకే అప్లై చేయాలి. ఎలాంటి తప్పులు దొర్లకుండా ఒకసారి చెక్ చేసుకుని సబ్మిట్ చేయాలి. ఏదైనా సమస్యలు తలెత్తితే జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం కూడా సహాయక కేంద్రాన్ని సంప్రదించవచ్చు.

-డా. కె.భాస్కర్,
దోస్త్ జిల్లా సహాయక కేంద్రం కోఆర్డినేటర్

కాలేజీ అలాట్‌మెంట్ అయితే..

ఈ నెల 24 వరకు వెబ్ ఆప్షన్స్‌ను స్టూడెంట్స్ పెట్టుకోవచ్చు. 29న మొదటి లిస్టు విడుదలవుతుంది. వెబ్‌సైట్‌లో వచ్చిన కాలేజ్ అలాట్‌మెంట్ లెటర్‌ను ఐడీ, పిన్ నెంబర్ ద్వారా లాగిన్ అయి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనుకున్న కాలేజ్ వస్తేనే కళాశాలకు వెళ్లి స్టూడెంట్ రిపోర్ట్ చేయాలి. లేదంటే ఆన్‌లైన్ రిపోర్ట్ చేసి సెకండ్ ఫేజ్, థర్డ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లకు వెళ్లాలి. కళాశాల కన్ఫర్మేషన్ చేయడానికి ఓటీపీ మొబైల్ నెంబర్‌కు వస్తుంది. అది కన్ఫర్మ్ చేస్తే సంబంధిత కాలేజ్‌లో సీట్ అలాట్ అయినట్టే.

ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

● ఈజీఎస్ ఏపీవో సంతోష్‌కుమార్

పెద్దశంకరంపేట/ఝరాసంగం/మనోహరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పేట మండల పరిధిలోని కట్టెల వెంకటాపూర్‌లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను, గ్రామంలోని నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు, రైతులు ఉన్నారు. ఝరాసంగం మండలం కంబాలపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో సుధాకర్ మంగళవారం పరిశీలించారు. కూలీలకు రోజూ పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఆయన వెంట ఏపీవో రాజ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వర్ ఉన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా సామాజిక బృందం వారు మంగళవారం మనోహరాబాద్ మండలం జీడిపల్లిలో ఉపాధి కూలీల సౌకర్యాలు, దినసరి వేతనం, మాస్టర్స్ రిజిస్టార్, జాబ్‌కార్డు గ్రీవెన్స్ కొలతలపై అవగాహన కల్పించారు. ఇందులో కార్యదర్శి సత్యనారాయణ, నాగరాజు, డీఆర్పీ నాగయ్య, ఈసీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దిశ కమిటీ సభ్యురాలిగా వనజ



చిన్నకోడూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా దిశ కమిటీ సభ్యురాలిగా చిన్నకోడూరు మండలం రామంచకు చెందిన తిప్పని వనజ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను దిశ కమిటీ సభ్యురాలిగా నియమించినందుకు ప్రధాన మంత్రి మోదీ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. దిశ కమిటీ లక్ష్యాలు, అవినీతిరహిత పాలనకు తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

'తెలంగాణరత్న-2025'కు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ పురస్కరించుకొని పురస్కారాలను ప్రదానం చేసేందుకు కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. రాష్ట్రంలో వివిధ కళల్లో ప్రతిభ కనబరిచినవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ రత్న పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 25 తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని అకాడమీ వారు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి మైనారిటీ నాయకుడి విరాళం



ఆలయానికి విరాళాన్ని అందజేస్తున్న జుబేర్

ములుగు, మే 13 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం వాగునూతి గ్రామంలో హనుమాన్ రామాలయం నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ మంగళవారం గ్రామస్థులకు రూ. 50వేలు విరాళంగా అందజేశారు.

మృతుల కుటుంబాలకు అండగా..

జగదేవ్‌పూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన బాబు వారం రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మంగళవారం పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తొగుట కస్తూర్బాలో సీఈసీ, వొకేషనల్ కోర్సులు

తొగుట, మే 13 (ఆంధ్రజ్యోతి): తొగుట కస్తూర్బా బాలికల పాఠశాలలో 2025 - 2026 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ విద్య అందుబాటులోకి వచ్చినట్టు తొగుట ఎంఈవో నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటగా సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులు మంజూరైనట్టు తెలిపారు. ఒక్కో విభాగంలో 40 మంది చొప్పున అడ్మిషన్లు చేపడతామని తెలిపారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు 7893163472 లేదా 9948313001 ఫోన్ నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

తెలంగాణ ద్రోహి జగ్గారెడ్డి

గజ్వేల్ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ద్రోహి జగ్గారెడ్డి అని బీజేపీ సీనియర్ నాయకుడు మామిండ్ల నాగు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈటల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోకపోతే నీకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు సమైక్యవాదులు ఇచ్చిన డబ్బులు తెచ్చుకొని సమైక్య ఉద్యమం నడిపిన దొంగవు అని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యమకారులు జైలులో ఉంటే తన సొంత ఆస్తులు అమ్మి తెలంగాణ ఉద్యమానికి ఖర్చు పెట్టిన గొప్ప నాయకడు ఈటల రాజేందర్ అని తెలిపాడు.

నిబంధనాల్లో ఇందిరమ్మ

- మంజూరీలు ఎక్కువ.. ప్రారంభాలు తక్కువ
- కడుతున్నా.. నిధులు సున్నా
- గిరిపల్లిలో 31 ఇళ్లకు..11మందికే రూ.లక్ష
- ఇదీ.. గజ్వేల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితి





గజ్వేల్ మండలం గిరిపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు, కుకునూరుపల్లి మండలం మేధినీపూర్‌లో..

గజ్వేల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు గజ్వేల్ నియోజకవర్గంలో ప్రారంభమయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని జిల్లాలోని ఆయా మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో గ్రామాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. నియోజవర్గానికి రూ.3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేయగా, మొదటి విడతగా మండలానికి ఓ పైలెట్ గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారు. గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్, మనోహరాబాద్, తూప్రాన్ మునిసిపాలిటీని మినహాయిస్తే గజ్వేల్ మండలంలోని గిరిపల్లి, జగదేవ్‌పూర్ మండలంలోని లింగారెడ్డిపల్లి, కుకునూరుపల్లి మండలంలోని మేధినీపూర్, వర్గల్ మండలంలోని అంబర్‌పేట, ములుగు మండలంలోని లక్ష్మక్కపల్లి, మర్కుక్ మండలంలోని భావనందాపూర్, కొండపాక మండలంలోని దమ్మక్కపల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు గ్రామాలుగా ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో మొదటి విడతగా పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన గ్రామాలతో పాటు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, తూప్రాన్ మునిసిపాలిటీల పరిధిలో ఎల్-1లో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

నిబంధనలు సడలించాలి

ప్రభుత్వ నిబంధనలు కొంతమేర కఠినంగా ఉండడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే పలువురు లబ్ధిదారులు జంకుతున్నారు. కేవలం 400 చదరపు అడుగుల నుంచి 600చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఇందిరమ్మ ఇంటికి అదనపు గదులు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పనులు చురుగ్గా సాగుతున్నప్పటికీ లబ్ధిదారుల్లో ఇప్పటివరకు చాలా తక్కువ మందికి రూ.లక్ష చొప్పున బిల్లులు వచ్చాయి. ఇంటి నిర్మాణం ఎంతవరకు పూర్తయిందో ఆ మేరకు రావాల్సిన బిల్లులు వెంటనే అందించాలని కోరుతున్నారు. త్వరగా బిల్లులు ఇస్తే మిగిలిన నిర్మాణ పనులు మరింత వేగవంతం చేస్తామని అబ్ధిదారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితి ఇలా..

గజ్వేల్ నియోజకవర్గంలో మొదటి విడతలో మంజూరీ లు బాగానే ఉన్నప్పటికీ పనుల ప్రారంభానికి లబ్ధిదారులు ఆసక్తి చూపనట్లుగా తెలుస్తుంది. ఇందుకు ముఖ్యంగా ఆర్థిక కారణాలు అడ్డంకి కాగా, ప్రభుత్వ నిబంధనలు, అదనపు గదుల నిర్మాణానికి అవకాశం లేకపోవడం మరో కారణంగా తెలుస్తుంది. కాగా నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పైలెట్ గ్రామాలకు మంజూరైన, ప్రారంభించిన ఇళ్లు, రూ.లక్ష చెక్కులు అందుకున్న లబ్ధిదారుల వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామం పేరు	మంజూరైన ఇళ్లు	పనులు ప్రారంభించినవి	రూ.లక్ష అందుకున్న లబ్ధిదారులు
గిరిపల్లి(గజ్వేల్ మండలం)	169	31	11
లింగారెడ్డిపల్లి(జగదేవ్‌పూర్)	68	03	0
మేధినీపూర్(కుకునూర్‌పల్లి)	72	11	06
అంబర్‌పేట(వర్గల్)	97	10	05
లక్ష్మక్కపల్లి(ములుగు)	56	07	04
భవానందపూర్(మర్కుక్)	112	14	01
దమ్మక్కపల్లి(కొండపాక)	30	10	01

వైభవంగా అన్నమాచార్యుల జయంతి



శ్రీ వెంకటేశ్వర స్వామికి అన్నమయ్య సంకీర్తన అర్చన చేస్తున్న పవన్ బృందం

సిద్దిపేట కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట శ్రీఅన్నమాచార్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అన్నమచార్య 617వ జయంతి ఉత్సవాలు రెండు రోజులపాటు వైభవంగా నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని మోహినిపురలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ముఖద్వారం ముందుగల శ్రీ అన్నమాచార్య దివ్యమూర్తికి అన్నమయ్య పవన్, తన శిష్య బృందం అభిషేక అర్చన సేవలు చేసి పూలమాలలు సమర్పించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని గర్భగుడిమండపంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అన్నమయ్య సంకీర్తన అర్చన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్కాన్ సాధువు శ్రీమాన్ రంగ తీర్థ ప్రభుజీ విచ్చేసి కార్యక్రమం ఆద్యంతం తిలకించి అన్నమయ్య పవన్ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అమరేశ్ విష్ణు, ఆలయ అర్చకులు అన్నమయ్య పవన్ దంపతులను, వారి శిష్యులను స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



ములుగు: కొత్తూరులో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ములుగు, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట సాగుతో అధిక దిగుబడులు సాధించేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం ములుగు మండలంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌కు చెందిన శాస్త్రవేత్తలు ములుగు మండల పరిధిలో లక్ష్మక్కపల్లి, అచ్చాయిపల్లి, కొత్తూరు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో రైతుల సందేహాలను నివృతి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అనిల్‌కుమార్, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

● **మద్దూరు:** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు నికరాదాయం లభిస్తుందని మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ మండలంలో 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. కొత్తగా సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీ ఇవ్వడంతో పాటు ఎస్సీ, ఎస్టీల రైతులకు వంద శాతం సబ్సిడీతో పాటు మొక్కలకు డ్రిప్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజు, అనూషతో పాటు రైతులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు కోసం వివరాలు అందించాలి

రాయపోల్/కొండపాక, మే 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు గుర్తింపు కార్డు కోసం సంబంధిత వ్యవసాయ విద్యుత్ విస్తరణ అధికారులకు అవసరమైన వివరాలు అందజేయాలని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబూనాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాయపోల్ ఏవో నరేష్‌తో కలిసి వడ్డెపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధార్‌కార్డు, భూమి పట్టా పాస్ బుక్ జిరాక్సులు తీసుకొని ఆధార్‌కార్డుకు లింక్ ఉన్న మొబైల్ ఫోన్‌తో సంబంధిత ఏఈవోలను కలవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో స్వర్ణలత పాల్గొన్నారు. అదేవిధంగా కొండపాక మండల కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శివ రామకృష్ణ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎల్లమ్మ చెరువు కట్ట వెడల్పు పెంచాలి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో చెరువు కట్ట వెడల్పు పెంచాలని మంగళవారం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏటా బతుకమ్మ పండగకు ఎల్లమ్మ చెరువు కట్టపై వేలాది మంది మహిళలు ఆడుకుంటారని, ప్రస్తుతం సుందరీకరణ పనులతో కట్ట మొత్తం ఇరుకుగా మారుతుందని, దీంతో వాకర్స్‌కు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. ప్రజా అవసరాల నిమిత్తం కట్ట వెడల్పు చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించినవారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, నాయకులు తదితరులున్నారు.

'ఉల్లాస్'ను విజయంతంగా నిర్వహించాలి

చేర్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యత పెంపొందించేందుకు ప్రభుత్వం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, ఉల్లాస్ ద్వారా చేపట్టనున్న ఓపెన్‌స్కూల్ నమోదును విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కొమురవెల్లి ఎంపీడీవో వర్మ అన్నారు. మంగళవారం కొమురవెల్లి ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ, ఆశ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామైక్యసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

హుస్నాబాద్ పాస్టర్ల నూతన కమిటీ

హుస్నాబాద్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండల పాస్టర్ల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఖాత సాల్మాన్ రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ మలాకి, కోశాధికారిగా పాస్టర్ టి ఎలిషా, సభ్యులుగా ఇజ్రాయిల్, క్రైస్తవ హక్కుల రక్షణ కమిటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మోజెస్ బాబురావ్‌ను ఎన్నుకున్నారు.

అంతా మా ఇష్టం

(5వ పేజీ తరువాయి)

ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ఆ తర్వాత ఫిర్యాదుదారుడికి రూ.2లక్షల తీసుకుని స్టేషన్‌కు రావాలని చెప్పారు. బయానగా ఇచ్చిన ఓ వ్యక్తిని ఎస్‌ఐ తన స్టైల్‌లో బెదిరించాడు. బయానదారుడు చేసేదేమీ లేక రూ.లక్ష తీసుకుని అక్కడి నుంచి భయంతో వెళ్లిపోయాడు. మిగితా రూ.లక్ష స్టేషన్ పైస్థాయి అధికారి టేబుల్ కౌంటర్‌లో వేసుకున్నారు. సదరు ఫిర్యాదుదారుడిని పిలిపించుకుని రూ.2లక్షలు అప్పగించినట్టు నమ్మించారు. మళ్లీ ఇంటి స్థలం వైపు రాకూడదని హెచ్చరించారు. ఇలాగే మరో గ్రామానికి చెందిన ఇంటి స్థలం విషయం కూడా స్టేషన్‌కు వచ్చింది. పెద్దమనుషులు పరిష్కరించడమేంటని మందలించడంతో వారు అక్కడి నుంచి వెళ్లగానే ఫిర్యాదుదారుడి వద్ద 10 వేలు తీసుకుని సెటిల్ చేస్తామని భరోసా ఇచ్చారు. ఆ మరుసటి రోజే ఏసీబీ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో దాడులు చేశారు.

వైశాఖ పౌర్ణమి ప్రత్యేక పూజల సందడి



చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో రథోత్సవం

చిన్నకోడూరు, మే 13(ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా పలుచోట్ల జాతర, రథోత్సవం, ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో మంగళవారం రథోత్సవాన్ని గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు, హనుమాన్ మాలాధారణ స్వాములు రథాన్ని తాళ్లతో లాగుతూ గ్రామంలోని పురవీధుల గుండా తిప్పారు. రథానికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

●**దుబ్బాక:** అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలోని దుబ్బరాజేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం కనులపండువగా సాగింది. మంగళవారం స్వామివారి పల్లకి సేవా, రథోత్సవం, హనుమాన్ శత కలశాభిషేకం తదితర ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

●**మర్కుక్:** మండలంలోని వరదరాజపూర్ గ్రామంలో శ్రీభూనీల సమేత వరదరాజస్వామి రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు వరదరాజస్వామి ఆలయ వంశ పారంపర్య ఆలయ ప్రధాన ధర్మకర్త గోపాలకృష్ణ తెలిపారు.

● **సిద్దిపేట కల్చరల్:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ చౌరస్తా వద్దనున్న వీర హనుమాన్ ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అఖండ హనుమత్ చాలీసా పారాయణాలను సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కొబ్బరికాయలను కొట్టి నైవేద్యంగా అర్పించారు. 108 పదార్థాలతో స్వామికి నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

● కోహెడ: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గవ్వ వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు డాక్టర్ కోహెడ ప్రసాదరావు హనుమాన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, మన్యు సూక్త అభిషేకం, మంగళ హారతులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ మాల దారులకు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేసారు.



అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లిలో హనుమాన్ అర్చన కోసం కలశాలతో వస్తున్న భక్తులు

● చేర్యాల: మండలంలోని దొమ్మాట గ్రామంలో దుర్గమ్మ, పెద్దమ్మ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సిద్దిపేట టాక్సీ డ్రైవర్స్ సొసైటీ సభ్యులు

సిద్దిపేట అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్ పేరిట భారత సైనికులు ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశానికి గర్వకారణంగా ఉన్నాయని సిద్దిపేట టాక్సీ డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్బు రమేష్, ఉపాధ్యక్షుడు బైరి నరేష్ పేర్కొన్నారు. భారత సైనికులకు సంఘీభావాన్ని తెలుపుతూ మంగళవారం సిద్దిపేటలో ది సిద్దిపేట టాక్సీ డ్రైవర్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, నరేష్, రవి, యాదగిరి, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఇష్టమైన ఆటల్లో నైపుణ్యాన్ని అందించాలి



మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ చైరపర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచుతూ ఇష్టమైన ఆటల్లో నైపుణ్యం అందించాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణ చంద్రమౌళి గార్డెన్‌లో వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసంస్కార్ ముగింపు వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో చిన్నారుల విన్యాసాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో పిల్లలకోసం ఇంతచక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న తోట అశోక్-సంధ్య దంపతులను మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రత్యేకంగా అభినందించారు. పిల్లలకు ఇష్టమైన ఆటలలో నైపుణ్యం పెపొందించుకునేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు కూచిపూడి, కరాటే,కర్రసాము, భరతనాట్యం,డ్యాన్స్ తదితర విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, కొమురవెల్లి అంజయ్య, చిప్ప ప్రభాకర్, అయిత అంజయ్యవిద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిన్నకోడూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నకోడూరు ప్రొబెషనరీ ఎస్‌ఐ ఆసిఫ్ అలీ సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దకోడూరులో మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, అపరిచిత వ్యక్తుల గూర్చి ప్రజలకు ఆయన సిద్దిపేట షీటీమ్ బృందం సభ్యులతో కలిసి అవగాహన కల్పించారు. సోషల్ మీడియాతో పాటు గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ లత, సిద్దిపేట షీటీమ్ బృందం, ఏఎస్‌ఐ కిషన్, కానిస్టేబుళ్లు మమత, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూరగాయలు విక్రయించవద్దు



వంటిమామిడి మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ములుగు, మే 13 (ఆంధ్రజ్యోతి): వంటిమామిడి మార్కెట్ ముందు కూరగాయల క్రయవిక్రయాలు చేయకూడదని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ములుగు మండలం వంటిమామిడిలోని కూరగాయల మార్కెట్ ముందు రోడ్లపైనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయని, అలా జరిగితే ప్రమాదాలు జరిగే అవకాశముందని మార్కెట్ పాలకవర్గంతో పాటు వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆర్డీవో, ములుగు తహసీల్దార్ మార్కెట్ వద్దకు వచ్చి కూరగాయలు అమ్ముకునే వారు మార్కెట్ లోపలే అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్తా, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లతో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలను తరలించొద్దు



బెజ్జంకిలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

బెజ్జంకి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను మరోచోటికి తరలించవద్దని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతికి వినతి ప్రతం అందజేసి మాట్లాడారు. గతంలో బెజ్జంకికి మంజూరైన రెసిడెన్షియల్ పాఠశాలను హుస్నాబాద్‌కు తరలించారని గుర్తు చేశారు. కొద్ది రోజుల క్రితం అక్కడ ఉన్న పాఠశాలను బెజ్జంకికి తీసుకువచ్చి బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్, నాయకులు పరిశీలించారని తెలిపారు. బాలికల పాఠశాలను మరోచోటికి తరలిస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, పాఠశాల తరలింపు యోచనను విద్యాశాఖ అకారులు విరమించుకోవాలని కోరారు.

కాల్పుల విరమణపై ప్రజలకు స్పష్టతనివ్వాలి

● కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 13: ఉగ్రవాదులకు కొమ్ముకాస్తున్న పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా కాల్పుల విరమణ చేయడంపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు వెనక్కి తగ్గిందో దేశ ప్రజలకు స్పష్టతనివ్వాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులపై ప్రపంచమంతా తీవ్రంగా ఖండించిందన్నారు. ఈ క్రమంలో పాకిస్తాన్‌పై భారతదేశం యుద్ధంలో గెలుస్తున్నప్పుడు ఎందుకు వెనక్కి తగ్గారని మండిపడ్డారు. పహల్గామ్ బాధితులకు మోదీ ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, హర్షద్, నజ్జు, బబ్బు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు చేయడం అలవర్చుకోవాలి

నంగునూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి తాను సంపాదించిన సంపాదనలో ఎంతో కొంత పొదుపు చేసుకున్నప్పుడే అది వృద్ధాప్యంలో ఎంతో ఉపయోగపడుతుందని పొదుపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బూసిరెడ్డి నరోత్తంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంక్షాపూర్ గ్రామంలో పురుషుల పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో 24 ఏళ్ల క్రితం 46 మందితో ప్రారంభమైన సంఘం నేడు 324 మంది సభ్యులతో రూ1.16 కోట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు పబ్బ అనంతరాజయ్య అధ్యక్షతన సమావేశంలో నరోత్తంరెడ్డిని ఘనంగా సన్మానం చేశారు. అనంతరం పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రారెడ్డితో పాటు 11మంది పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.